## గొప్పవారితో గుసగుసలు

# ఎఱ్ఱాప్రెగడ

### కీ॥ శే॥ శ్రీ వారణాసి శ్రీనివాసరావు

[పాకనాటి సీమలోని గుడ్లూరులో శివాలయంమండపం మీద కూర్చున్న యెఱ్ఱాప్రెగడ, వినికిమేర దూరం రాగానే నన్ను—]

ఎ—వచ్చావ్ నాయనా, వచ్చావ్! ఇంకా రాలేదేమో అనుకుంటున్నా!

నే—(చిరునవ్వుతో) నే వస్తానని మీ కేం తెలుసు నండీ. న న్నెరుగున్న వారికిమల్లే అంటున్నారు. ఎట్లా యెరుగున్నారండీ?

ఎ—పది రోజులైనాడు మీ తిక్కన్న గారు చెప్పారు, నీ విట్లా పనిమీద వస్తావని. ఇక గుర్తుపట్టడానికి, వెనకటికి—యెవరో ఒకాయనో వంతులూ, పంతులూ'అని పిల్చాట్టోకరు. 'నా పేరు మీకెలా తెలుసునంటే, నీ మొగం చూస్తే తెలీదా' అన్నాడట. అట్లా కొంటె తనం తొణికిసలాడే కండ్లు, వెక్కిరింపు విలుపు పెదవి, పుట్టుమచ్చ, ఒడ్డూపొడుగూ, సహజ కవితాసిద్ధియైన తిక్కనార్యుడు వర్ణించుంటే, కొన్ని వేల ప్రజలోగూడా నిన్ను తేలిగ్గా గుర్తుపడితే వాడు పోల్చుకోలేక పోతాడా?

నే—మొత్తానికి కవులండీ! ఇంకా యేమేం జెప్పారేమిటండీ?

ఎ—అవంతా యెందుకు లేస్తూ! నీవు శ్రమపడి అడక్కుండా కొన్ని చెబుతా విను. నేనే భారతాన్ని పూర్తిచేసిన యెఱ్ఱన్నను. నన్నే ప్రబంధపరమేశ్వరు డంటారు. నా మెళ్లో రుద్రాక్షమాల, నుదుటి విభూతీ నేను శివభక్తుణ్ణని చెప్పక చెబుతాయ్. నే కొండవీటి ప్రభువైన అనవేమారెడ్డి ఆశ్రితుణ్ణి, బీదవాణ్ణి. ఇంకా యేమడుగుతావో అడుగు.

నే—గుక్క తిప్పకుండా చెప్పారే, కావలసినవి తప్ప!

ఎ—ఆఁ, నే వ్రాసిన గ్రంథాలు.

నే—అక్కర్లా, అక్కర్లా! నాకు తెలుసు. కాని నన్నయ్యగారు, తిక్కన్నగారు ఎప్పుడో పరంపదిస్తే అన్ని గ్రంథాలు వ్రాసిం తర్వాత భారతం పూర్తిచేసారేం, ముందే వ్రాయక?

ఎ—అడగడం బహు మర్యాదగా అడుగుతా వేదీ యెరగనట్లు; లోపల వుద్దేశం మట్టుకు పెద్దది. అయినా చెప్తా; ఎందుకంటే, అప్పుడు చేద్దామని తోచింది కాబట్టి.

నే—అట్లాగా, ముందే యెందుకు తోచలా?

ఎ—(మొండితనంగా) తోచలేదు కాబట్టి.

నే—ఎందుకండీ యిట్లాంటి మాటలు?

ఎ—అబ్బబ్బా! పట్టుకుంటే జీడివని తిక్కన్నగారు చెప్పనే జెప్పారు. నీ రం ధేమిటంటే ఆరణ్య పర్వ రచన మరణాంతకం, అది వ్రాస్తే తమకా దుస్థితి తటస్థిస్తుందేమో నని తిక్కన్నగారు దాని జోలికి పోలా. మనకు దాన్నెంత పూర్తి చేద్దామని వున్నా, అన్నీ వుడిగి, కాటికి కాళ్ళు చాచినా డు వ్రాస్తే బాగుంటుందని నే ననుకొని చివరకు వ్రాసానా, లేదా అని కనుక్కుందామని నీ రంధి కాదూ? వ్రాస్తూ వ్రాస్తూ కాలంతీరి ఆయన బాయ. వ్రాయడాని కవకాశంలేక యీయన బాయ. అదొక పెద్ద వదంతైపోయ. దానికి ఝడిసి నేనూ ముందే వ్రాయక వెనక వ్రాస్తిని. ఒక్కమా టడుగుతా చెప్పు—ఆరణ్య పర్వ రచనం మరణాంతకమైతే నేను వ్రాస్తూండగా పోలేదేం? పూర్తి చేసి రెండేండ్లయిందాకా వున్నానేం?

నే—నాకేం తెలుసండీ? చెప్పగలిగితే, మిమ్మల్నడగడ మెందు కండీ!

ఎ—(చిరునవ్వు నవ్వుతూ) మంచి గడుసరివి! అసలు మీ కాలం వాళ్లంతా గడుసువాండ్లే! గడుసుతనంతో లేని బండార ముందని పించుకుంటున్నారు. చెప్తా విను. ముందే యెందుకు వ్రాయ లేదంటే వారిద్దరు, నన్నయ తిక్కనలు, బ్రహ్మకల్పులు, మహాకవులు; గ్రంథం లోకోత్తరమైంది. ఆరి తేరిన కవిత్వాని కొంగేదికాని, సాధారణ రచన కందేది కాదు. కాబట్టి నా కవిత్వం గడు సెక్కితేగాని వ్రాయగూడదని ఆగి చివరకు వ్రాసా. సరేనా?

నే:—చిత్తం: అట్లా చెప్పండి, సమంజసంగా వుంది. కాని ఆహా యెంతచమత్కారండీ! నన్నయగారిలాగా సంస్కృత మెక్కువ్వాడక, తిక్కనగారివలె తెలుగెక్కువ్వాడక రెండు భాషల్ను సమపాళ్ల గలిపి కూర్చారు?

ఎ:—అదిగో! అంకురించిందీ మళ్ళీ పూర్వ జాడ్యం? నన్నయగార్ని, తిక్కన్నగార్ని కూడా యిట్లాగే అడిగావట. అది నా రచన నైఖరికాని సంకల్పంగాదు. నా వ్రాతతీ రప్పడూ అదే.

నే:—బాసండి. మీ రుత్తర హరివంశంలో 'నన్నయ భట్టుకుంజరు' మన్నారేం?

ఎ:—(బొమ్మ చిటిచుకొంటూ ఆశ్చర్య పడుతూ) ఆరి సాహసుడా! 'ఎట్లా టాక్షేపణ చేసావ్? ఆయ న్నేనుసతో పోల్చారేం, తిర్యగ్జంతువుతోనా? ఆ పాదమింకా కొంత చదవ్వేం? వారి కవిత్వాన్ని వర్ణిస్తూ "నన్నయ భట్టు కుంజరం బరయ నిరంకుశోక్తిగతి" పోవడ మెరుగమా అన్నా; అంటే వారివాక్కు ధారాశరంగా, ఏలాటి అడ్డురాకుండా సాగుతుం దన్నాగాని అయన్నొక జంతువుతో బోల్చలా.

నే:—చిత్తం. నన్నయగారి చివరి 'శారద రాత్రు లుజ్జ్వలలసత్తర తారక హారపంక్తులన్' పద్యా న్నందుకుంటూ, తామురాసిన 'స్ఫురదరుణాంశు రాగరుచి పొంకిరివోవ నిరస్త నీరదావర...' అన్న పద్యం ధార దాన్ననుసరించిన 'దానాంభః పటలంబునం' అన్న పద్యంలో పడి పోయిందేం?

ఎ:—ఏ మోయ్ నీతో సంకటమే! నన్నయగారి ధారను సాగించడం నా తరమేగాదు, ఎవరితర మీ ఆంధ్రంలో! ఏదో పది పద్యాలంటే, అక్కడక్కడ నచ్చగలంగాని చివరెల్లా అట్లా నడిపించడాని కాయనగారే మళ్ళీ రావాలి. ఇంతకూ ఆయనకంటే, తిక్కన్నగారి కంటే నే నెక్కువవాణ్ణని అనుకుంటేగా?

నే:—అదేం మాట్లేండి: మీరు వారితో సమానులని జగమంతా ఘోషిస్తూంటే! అది సరే, సైంధవుడు ద్రౌపది నవమానించిన ఘట్టం కూర్చటప్పుడు వెనకనుంచి రథంమీద నామె నెత్తుకు పోతూన్న సైంధవుణ్ణి నిరాకరింపిస్తూ, నామె చేత పద్యాల జంటలు చెప్పించారేం? అట్లాగే అక్కడక్కడ కనబడుతూంటాయ్.

ఎ:—నిజమే వాటిని చూచి నీ వే మనుకున్నావ్?

నే:—ఏమీ లేదు. ఈ కవీశ్వరుడికి భారతమంతా వ్రాయలేక పోతిమికదా అని నోరూరి, 'సమయం వచ్చింది. అధికస్య అధికం ఫలం' అని వాక్కుసు ఝాడించారా అనుకున్నా.

ఎ:—(నా వీపుచరుస్తూ) నే ననుకుంటున్నట్లు గట్టివాడవే! భారతం వ్రాయలేక పోతింగదా యిదే సమయమని వ్రాయలేదు కాని, వ్రాసేటప్పు డావేశంచేత వ్రాశా. మళ్ళీ చదివినప్పుడు నీకు దోచినట్లే తోచి, ఎక్కువైనవి కొట్టివేద్దామా అనుకుని వ్రాసింది తీసేయలేకూరుకున్నా.

నే:—ఔన్లేండి, అది కవుల కందరికీ వుండే లక్షణమే. మీరు కాబట్టింతమాత్రమైనా ఒప్పుకుని చెప్పారుగాని, మా కాలంలో 'విశ్వనాథ సత్యనారాయణైతే వ్రాసింది తీసేయమంటావా అని పైనబడి కరిచేవాడే!

ఎ:—ఏ మిటో! కొందరి కట్లా గనుపిస్తుంది. అది పాటించ దగ్గది కాదు!

నే:—సప్తమాశ్వాసం చివర తమరు వ్రాసారు సీసమొకటి, కందమొకటి. సీసంలో 'గుణగరిష్ఠుడు' 'ధర్మైకతత్పరాత్ముడు' నని మిమ్మల్ననుకున్నారు. నన్నయభట్టుగారి అంశ చేతడంచేత నని కందంలో—

"ధీరవిచారుడు తత్కవి
తారీతియు గొంతదోప దద్రచనయకా
నారణ్య పర్వశేషము
పూరించె కవీంద్రకర్ణపుటపేయముగాన్"

అని వ్రాశారు...

ఎ:—(అడ్డం తగిలి) ఓన్నీ శంక చల్లగా వుండ! అన్నారు కదా నన్నయ తర్వాత తిక్కనగారు చూపించని గర్వం చూపించారని కాదూ నీ బాధ? నన్నయగారి అంశ ప్రవేశించ బట్టి అనడంలో, సాధుజన హర్షసిద్ధి గోరి అనడంలో, తద్రచనయకా అనడంలోనున్న మహా వినయా న్నాదరించక, గుణగరిష్ఠుణ్ణి, ధర్మైక తత్పరాత్ముణ్ణి, కవీంద్ర కర్ణపుటపేయంగా వ్రాస్తాను అనుకోవడంలో నీకు పొడ కడ్తున్న కించిద్గర్వాన్ని పురస్కరించుకుని బాధపడుతున్నావుగాని, నాయనా, నిజానికి తెలీక లోపాలే కానేమో, ఎప్పుడూ దేవుని మొగం జూచి ప్రవర్తించా. చేతనైనంతవరకు న్యాయాన్నే పాటించా. కవులందరు మెచ్చుకోవాల్సనే అవధి బెట్టుకుని వ్రాసా.

నే:—(నమస్కరిస్తూ) అయ్యా, నన్ను చివరల్లా చెప్పనీకుండా చెప్పారు. పెద్దల కడ్డం రాకూడదని ఆగా. తమరట్లాటివారని యెరుగున్నా, నే నడగొచ్చింది అట్లాంటివారు స్వతంత్రించకుండా వారి రచనే అని యెందు కనుకున్నారని అడగ బోయినా.

ఎ:—అదా, ఐతే సరే. నాయనా నన్నయభట్టుగారు పెద్దలు; వారిముందు నే నెంతవాణ్ణి. ప్రొద్దు గ్రుంకుతుంది (లేస్తారు).

నే:—ఎంత వినయముంది స్వామీ మీకు!

(నిష్క్రమణం)

---

స్త్రీ సాహిత్యము:

# పాండిత్యం

### శ్రీమతి సమయమంత్రి రాజ్యలక్ష్మీదేవి

పూర్వకాలం సాధారణంగా ప్రతీ బ్రాహ్మణుడూ సంస్కృత పండితుడై యుండేవాడు. స్త్రీలుకూడా విద్యావతులై యుండేవారు. మనం సాధారణంగా చెప్పుకొనే మైత్రేయి, గార్గి, గౌతసరస్వతి, మొదలయిన వారే కాక, ప్రతిగృహిణీ కూడా, కొలది గొప్పలు పాండిత్య ప్రతిభ కలిగియుండే వారట.

నిగమశర్మ బ్రాహ్మణుడు. వేదాధ్యయన సంపన్నుడే కాక పండిత ప్రవరుడుకూడా. లక్ష్మీ సరస్వతు లత్తాకోడండ్రవుటవల్ల కాబోలు, ఆ ద్విజుడు ధనాధికుడు కాడు. ఏదో ఆపూటకు చారు, పచ్చడితో గౌరవంగా కాలక్షేపం చేసే కలిమి. భార్య సీతమ్మ చాలా వుత్తమయిల్లాలు, సాధ్వి, మంచి విద్యావతి. సతీపతుల నురక్తులు. శిష్యవర్గం లెక్కకు మిక్కిలిగా ఉంది. నిగమశర్మ విద్య బోధించేటప్పుడు గురువుగానూ, యితర సమయంలో తండ్రిగానూ; సీతమ్మ, శిష్యులను పనులకు నియోగించేటప్పుడు, గురుపత్నిగా వున్నా, అన్నపానాదుల విషయంలో తల్లిగానూ, ఆదరించేవారు.

అది ఉదయం. కాలకృత్యాలూ, సంధ్యావందనాది వైదిక కార్యాలూ, పూర్తిచేసినతర్వాత నిగమశర్మ వీధి అరుగుమీద, తాటిఆకుల చాపపైన కూర్చుండి, శిష్యులకు విద్యా ప్రబోధం చేస్తున్నాడు. బ్రహ్మతేజస్సు వెలుగుతూ వుందతని ముఖంలో. లేగ ఆవుదూడ తనివితీరా మాతృక్షీరాన్ని గ్రోలి, గ్రేవుకుంటూ, ప్రాంగణంలో గంతులు వేస్తూవుంది. ప్రకృతి ఆనందంతో విహరిస్తూం దా ప్రదేశంలో.

అంతలోకే నే ప్రత్యక్షమయ్యాడు అతిథిదేవుడు-అంగవస్త్రం, నారపంచా ఒకచేతిలోనూ, మెరుస్తూన్న రాగి జారీచెంబు రెండవ చేతిలోనూ ధరించి, పనసలు పారాయణచేస్తూ. చటాలున సామగాన మాగింది. అర్ఘ్యపాద్యాసనాదిఆరంభ గౌరవా లయాయి. కుశలప్రశ్నలు ముగిశాయి. అతిథీ పండితవరుడే. ఇరువురు పండితులు కలుసుకుంటే ఫలితం, పండిత గోష్ఠిగా. శిష్యులు, నిశ్శబ్దంగా, ఆతురతతో, ఆసక్తితో వింటున్నారా తీయని వాదం. ప్రసంగం మంచిపట్టులోకి దిగింది. ఇద్దరూ ఆవేశపూరితు లయారు. ఇంతట్లోకే చావడిలోని లోగుమ్మం తలుపుచాటు నుంచి, కడియాల రవళి వినవచ్చింది. సంభాషణ సాగుతూనే వుంది. నిగమశర్మ క్రిందిశ్లోకం చదివాడు:

మత్కుణాం నదిసంయుక్తం
గోపత్నీ సింహసంయుతం,
విచారఫలసంప్రాప్తం
గ్రామచూర్ణంతు సంభవం.

అతిథిదైవాని కీ శ్లోకంచదవడం, అసందర్భంగా కనుపించటమే కాకుండా అర్థసందర్భం కూడా, అవగాహన కాలేదు. మాటలమధ్య ఏదో పాడుకుంటూ వుండడం ఆ గృహస్థు కలవాటేమో అని అనుకున్నా అర్థం చేసుకునేందుకు ప్రయత్నిస్తూనే వున్నాడు, సంభాషణ సాగిస్తూ.

మధ్యాహ్నం పన్నెం డయింది. వంట లయాయని కబురుపెట్టారు శిష్యవర్గం. మడి కట్టుకుని యిద్దరూ భోజనాని కాసీనులయారు. కందిపప్పూ, చింతచిగురూ, పూరుపిండీ, చారూ విస్తళ్లో వడ్డించి వున్నాయి. అన్నపూర్ణతో సహా. సీతమ్మ వడ్డన చేస్తూ వుంది.

అతిథీగృహస్థులమధ్య ఇష్టాగోష్ఠి అతిగా సాగుతుంది. "శారదాధాత లవతరించిన ట్లున్నా రే యిచ్చట" అన్నా డతిథిదేవుడు పూరుబిండికలిపిన మొదటిముద్ద నములుతూ. 'పెద్దల ఆశీర్వచనం' అన్నాడు నిగమశర్మ. నెయ్యి వడ్డిస్తూ వున్న సీతమ్మ నునుసిగ్గుతో వంటయింటిలోనికి వెళ్లిపోయిందిచటాలున. భోజనానంతరం కాస్సేపు విశ్రమించి, అతిథిదేవు డా విద్వద్దంపతుల నాశీర్వదించి తదుపరి ప్రయాణం సాగించాడు.

ఈఘట్టంలో కడియాల సవ్వడికీ, గోష్ఠిమధ్యలో నిగమశర్మ చదివిన శ్లోకానికీ, పూరుపిండికీ, అతిథిదేవుడు భోజనసమయమందు చేసిన ప్రశంసకూ గల సంబంధం చాలా సున్నితమూ అహ్లాదకరమూ, అయివున్నది.

సామగాన మాగిపోగానే, లోన పని చేసికుంటూవున్న గృహిణి, సావడిలోనికి వచ్చి, అతిథిరాక నర్థంచేసుకుంది. ఇప్పటిట్లా అప్పుడు వీధికి రెండు హోటళ్లు లేవు. ఉన్నప్పటికీ నిష్ఠగలవారు తినేవారూ కారు. ఆ కారణంచేత అతిథి భోజనానికి తప్పనిసరి. వంటకా లేవో ఇదివరకే భర్తతో ఆలోచనచేసింది. పప్పుచారు తప్ప, పచ్చడి లేదా పూటకు. అతిథిరాక, అందుచేత, ఆమె భర్త కర్థమయ్యేట్లు మంజీరధ్వని చెయ్యటం, అపరబ్రహ్మఅయిన శర్మ, దాని అర్థం తెల్సుకుని జవాబుగా చదివాడు.

[మత్కుణం=నల్లిని, నదిసంయుక్తం=ఏరుతో కలిపి=నల్లేరు గో=ఆవు, పత్ని=ఆలు=ఆవాలు, సింహ=పుష్పం, సంయుతం=కలిపి, విచార=చింత, ఫలం=పండు=చింతపండు, సంప్రాప్తం=చేర్చితే గ్రామ=వూరు. చూర్ణంతు-పి=డితో=పూరుపిండి, సంభవం=పుట్టును, అగును.]

ఆమె విద్యావతికనుక, చటాలున, అర్థం గ్రహించి, ఆ పదార్థాన్ని తయారుచేసి తమ కాపురంయొక్క గౌరవాన్ని నిలబెట్టింది.

అతిథిదేవుడు, పూరుపిండిముద్ద నమిలినప్పుడు, శ్లోకార్థం తెల్సుకుని, అమందానందకందళిత హృదయారవిందుడయి, ఆనందం పట్టలేక ఆ దంపతులను శారదాధాతలతో పోల్చాడు. ఆ ప్రశంసతాత్పర్యం క్షణంలో ఆదంపతుల, కవగాహన కావటమూ, గృహస్థు మరియాదగా ఆ గౌరవాన్ని, పెద్దలకు వదలటం, గృహిణి నును సిగ్గుతో వంటయింటిలోనికి వెళ్లటమూ జరిగాయి.